

న్యూస్‌రీల్

పొడా వైస్ చైర్మన్‌గా డాక్టర్ గజ్జెల శ్రీనివాసరెడ్డి



సాక్షి, నరసరావుపేట: పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పొడా) వైస్ చైర్మన్‌గా డాక్టర్ గజ్జెల శ్రీనివాసరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మాత్యసంస్థ పశుసంవర్ధక శాఖలో ఏడీ స్థాయిలో పని చేస్తున్న శ్రీనివాసరెడ్డి డెప్యూటేషన్‌పై ఈ పోస్టులో పనిచేయనున్నారు. గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో డ్వామా పీడీగా, జెడ్పీ సీఈఓగా శ్రీనివాసరెడ్డి ఉత్తమ సేవలు అందించి ప్రశంసలు పొందారు.

రీ-సర్వేతో భవిష్యత్ తరాలకు మేలు

జేసీ రాజకుమారి




గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం భవిష్యత్ తరాలకు ఒక వరమని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. 5 గ్రామాల్లో భూముల రీ సర్వే పూర్తి చేసిన సర్వే శాఖాధికారులు మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో వాటి వివరాలు సమర్పించారు. జేసీ మాట్లాడుతూ ఈ ఏడాది చివరినాటికి రీ సర్వే పూర్తి చేస్తామన్నారు. ముఖ్యంగా ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని చెప్పారు. మేడికొండూరు మండలంలోని పానుగుపాడు కండ్రిక, వట్టిచెరుకూరు మండలంలోని లేమల్లెపాడు గ్రామాల్లో సెక్షన్ 13 నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. ఈ రెండు గ్రామాల్లోనూ సర్వే నిర్వహిస్తామని పేర్కొన్నారు.

భావన్నారాయణుని తాకిన సూర్యకిరణాలు



చినగంజాం: పెదగంజాం భావన్నారాయణ స్వామి ఆలయంలో మంగళవారం సూర్యకిరణాలు స్వామి మూలవిరాట్‌ను పాక్షికంగా తాకాయి. ప్రతి ఏడాది మార్చి, సెప్టెంబర్ నెలల్లో ఈ సుందర దృశ్యం భక్తులను భక్తిపారవశ్యంలో ముంచుతుంది. మంగళవారం నుంచి స్వామి వారిని కిరణాలు తాకడం ప్రారంభం కాగా రానున్న రెండు మూడు రోజుల్లో స్వామి వారిని పూర్తిగా అభిషేకించడాన్ని భక్తులు చూడవచ్చని ఆలయ అర్చకులు తెలిపారు.

యార్డుకు 1,10,256 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,10,256 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,07,643 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.26,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.7,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 78,674 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.


9, 10 తేదీల్లో 'ఎకనామిక్స్' జాతీయ సదస్సు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో '75 సంవత్సరాల భారతీయ ఆర్థిక వ్యవస్థ-ఆర్థిక వృద్ధి, పంపిణీ సమన్యాయం' అనే అంశంపై ఈ నెల 9, 10 తేదీల్లో జాతీయ సదస్సు జరుగుతుందని ఎకనామిక్స్ విభాగాధిపతి ఆచార్య కె.మధుబాబు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో దేశంలోని పలు యూనివర్సిటీలు, ఆర్థిక పరిశోధన కేంద్రాల నుంచి అధ్యాపకులు, ఆర్థికవేత్తలు పాల్గొని పరిశోధన పత్రాలు సమర్పించనున్నారన్నారు.

అవనికి అగ్రతాంబూలం

జగతి ప్రగతిని మార్చే అవనికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అగ్రతాంబూలం ఇచ్చింది. ఆడబిడ్డలకు కూడు, గూడు నేనేనంటూ ఇంటి పట్టాలతో మనసారా పట్టాభిషేకం చేసింది. చెమట చుక్కల కష్టానికి 'ఆసరా'నంటూ డ్వాక్రా రుణాలను అక్కచెల్లెమ్మల కొంగుకు ముడేసింది. ఇంటి దీపానికి ఆర్థిక చమురు చేయూతగా అందించి భువనను విజయపు గగనాన నిలిపింది. చట్టసభల్లోనూ సగానికి పైగా మహిళా గొంతులు నినదిస్తుంటే.. ఔను ఈ ప్రభుత్వం మహిళా పక్షపాతి అంటూ బల్లగుద్ది మరీ చెబుతోంది. పదవుల్లో, కొలువుల్లో ముందు వరసలో నిలిచిన మగువ తెగువకు సలాం కొట్టింది. కోరలు చాచిన కామ నాగులు బుసకొడుతుంటే దశ 'దిశ'లా రక్షణ కంచె కట్టి వాటి పడగపై నాట్యమాడుతోంది. నాలుగేళ్ల కాలంలో మహిళా లోకాన్ని మహారాణులుగా మార్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళా దినోత్సవం సందర్భంగా వారిని మరోసారి నిండు మనసుతో ఆశీర్వదిస్తోంది.

– సాక్షి ప్రతినిధి, గుంటూరు



- మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట
- సీఎం వైఎస్ జగన్‌కు జేజేలు పలుకుతున్న మహిళాలోకం

అవకాశాలు పుష్కలం



ఆంధ్రప్రదేశ్‌లో గతంలో ఎన్నడూ చూడని విధంగా మహిళా పక్షపాతిగా ఉన్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అన్ని రంగాల్లో మహిళలకే అగ్ర ప్రాధాన్యత ఇచ్చి ముందుకు నడిపిస్తున్నారు. అట్టడుగు వర్గాలకు చేయి అందించి, రాజకీయంగా ఎదిగేందుకు చేయూత ఇవ్వడం, ప్రోత్సహించడం బహుశా దేశంలోనే ఎక్కడా లేని పరిణామం. మహిళలను సొంత అక్కా, చెల్లెళ్లుగా భావించి వారికి అన్ని హక్కులు కల్పించి, గౌరవ ప్రదమైన స్థానం ఇచ్చిన గొప్ప ప్రజా నాయకుడు.

–కత్తెర హెనీ క్రిస్టినా, జెడ్పీ చైర్‌పర్సన్

పథకాలతో మహిళాభివృద్ధి



రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత సాధించే దిశగా చేస్తున్న కృషి దేశానికే ఆదర్శం. గడచిన మూడేళ్లలో జిల్లాలో వేల కోట్ల రూపాయలతో మహిళల జీవనోపాధి, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న కార్యక్రమాలు ఎంత చెప్పినా తక్కువే. ఒక ఉన్నతాధికారిగా నా వంతు పాత్ర కూడా పోషిస్తున్నందుకు సంతోషంగా ఉంది.

– జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్

మహిళలకు దిశ భద్రత



విద్యార్థినులు, మహిళలు, యువతులకు ఎటువంటి కష్టం వచ్చినా 'దిశ' ఎంతో భద్రత కల్పిస్తోంది. నిత్యం ఉన్నతాధికారుల పర్యవేక్షణలో దిశ యాప్ నిర్వహణ జరుగుతోంది. మహిళా పోలీసు సిబ్బంది కోసం దిశ అన్ని విధాలుగా ఉపయోగపడేలా దిశ బస్సును ఏర్పాటు చేయటం సంతోషదాయకం. మహిళలు టెక్నాలజీ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నాం.

– కె. సుప్రజ, ఏఎస్పీ, గుంటూరు

మహిళాభ్యుదయంలో దేశానికే ఆదర్శం జగనన్న



ఎక్కడ మహిళలు గౌరవించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని నానుడి. అందుకు అనుగుణంగా ఏపీలో పాలన కొనసాగుతోంది. అనాదిగా మహిళలకు ప్రాధాన్యత ఇచ్చే సంస్కృతి మనది. అందుకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి మనసు, ఆదర్శవంతమైన ఆలోచన విధానం కారణంగా మహిళలు తలెత్తుకు తిరిగేలా పాలన కొనసాగుతోంది. సాధారణ మహిళనైన తనతో పాటు నలుగురు మహిళలకు మంత్రి పదవులు కల్పించారు. మహిళా సాధికారత విషయంలో మన రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. ప్రజా సంకల్ప యాత్రలో మహిళల కష్టాలు విన్న జగనన్న వారి అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేస్తున్నారు. పాదయాత్ర నుంచి పుట్టుకొచ్చిన నవరత్న పథకాలు మహిళలకు ఎంతో మేలు చేస్తున్నాయి. సంక్షేమ పథకాలతో పాటు మహిళలకు 50 శాతానికిపైగా పదవులు కట్టబెట్టి గతంలో ఎన్నడూ లేనంత ప్రాధాన్యత కల్పించిన మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగనన్న.

– విడదల రజిని, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి

స్థితిగతులు మార్చడం గొప్ప విప్లవం



గ్రామీణ ప్రాంత మహిళల స్థితిగతులు మార్చే గొప్ప విప్లవం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతోంది. ఇది నిజమైన మహిళా సాధికారితకు దోహదం చేస్తుంది. అనేక పథకాల ద్వారా గ్రామీణ మహిళలు ఆర్థిక సాధికారిత పొందుతున్నారు. గతంలో పాఠశాలల్లో మరుగుదొడ్ల వంటి కనీస వసతులు, సంరక్షణ లేకపోవడం వల్ల యుక్త వయస్సుకు వచ్చిన బాలికలను చదువు మాన్పించేవారు. బాలికల విద్యకోసం సీఎం ప్రవేశ పెట్టిన అనేక పథకాల వల్ల పాఠశాల స్థాయిలో బాలికల జీఈఆర్(గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో) గణనీయంగా పెరిగింది.

– ఆచార్య సరస్వతి రాజు అయ్యర్, పాలకమండలి సభ్యురాలు, ఏఎన్‌యూ

అండగా పోక్సో కోర్టు



చిన్నారుల రక్షణ కోసం 2012 సంవత్సరంలో పోక్సో చట్టం ఏర్పడింది. ప్రత్యేకంగా దీనిని చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టుగా పిలుస్తారు. చిన్నారులకు ఎంతో భద్రత కల్పించేలా చట్టం ఏర్పడింది. అభంశుభం తెలియని చిన్నారుల పట్ల నీచానికి పాల్పడే వారికి అత్యంత త్వరితగతిన విచారణ పూర్తి చేసి శిక్షలు విధిస్తూ.. న్యాయస్థానాలు అనేక తీర్పులు ఇచ్చాయి. అదే విధంగా బాధితులకు నష్టపరిహారం సైతం అందజేయటం జరుగుతుంది. చిన్నారుల పట్ల ఏదైనా దురదృష్ట సంఘటన జరిగితే కేసులు పెట్టేందుకు తల్లితండ్రులు ముందుకు రావాలి.

– కారుమంచి శ్యామల, స్పెషల్ పీపీ, పోక్సో కోర్టు, గుంటూరు

అభివృద్ధి దిశగా సాధికారత



రాష్ట్రంలో మహిళా సాధికారిత రోజు రోజుకి అభివృద్ధి చెందుతోంది. ప్రభుత్వ పరంగా వెలువడుతున్న ఉద్యోగ ప్రకటనలతో మహిళల్లో మరింత ఉత్తేజం ఏర్పడుతుంది. వారిలో ఒక మనోధైర్యం కలుగుతుంది. ఏ రంగంలోనైనా మహిళలు వారి శక్తి సామర్థ్యాల తో సత్తా చూపుతున్నారు. ఇక బాలికలు, విద్యార్థినీలు, మహిళలు, వృద్ధుల భద్రత, రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయి. భద్రత, రక్షణ విషయాల్లో ఏపీలోని మహిళలకు అత్యధిక ప్రాధాన్యతను కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా ఫ్రెండ్లీ పోలీస్‌ను నిర్వహిస్తున్నారు.

– జెస్సీ ప్రశాంతి, దక్షిణ సబ్ డివిజన్ డీఎస్పీ, గుంటూరు.

పార్లమెంట్ సాక్షిగా కీర్తి..



మహిళా రక్షణ, సాధికారితకు ఏపీ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను పార్లమెంట్ సాక్షిగా కొందరు కీర్తించడమే మహిళా సాధికారితపై ఏపీ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనం. ఏపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన దిశ బిల్లుతోపాటు అనేక మహిళా సంస్కరణలను ఇతర రాష్ట్రాల వారు వచ్చి అధ్యయన చేయడం ఎంతో గర్వకారణం. ఏపీ ప్రభుత్వం మహిళలకు పదవులతోపాటు సముచిత గౌరవాన్ని కూడా కల్పిస్తోంది. ఏపీలో మహిళా సాధికారిత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలి కేబినెట్ నుంచే మొదలయ్యింది. మహిళలకు హోం మంత్రితోపాటు అనేక కీలక మంత్రిత్వ శాఖలను అప్పగించి నిబద్ధతను చాటుకున్నారు.

– ఆచార్య ఎ.ప్రమీలారాణి, ప్రిన్సిపాల్, ఏఎన్‌యూ ఫార్మసీ కళాశాల

మహిళల్లో చైతన్యం పెరిగింది



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషి కారణంగా స్థానిక సంస్థల నుంచి దేశ రాజకీయాల వరకు మహిళల పాత్ర పెరిగింది. దీంతో రాజకీయ చైతన్యం వస్తుంది. మహిళాభివృద్ధి ఉన్న చోట ఆ సమాజం సంతోషంగా ఉంటుంది. వ్యాపార రంగాల్లో కూడా వారు విస్తరిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే మహిళలేని ఏ వ్యవస్థ అభివృద్ధి చెందదు. సాక్షాత్తూ మన దేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా ఎన్నో కష్టాలనెదుర్కొని ఆ స్థాయికి వచ్చారు.

–పల్లవి, స్టెప్ సీఈఓ, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఉమ్మడి జిల్లా.

దివ్యోత్సవం.. రథోత్సవం



మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి దివ్య రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

- పోటెత్తిన భక్తజనులు
- కిటకిటలాడిన మంగళగిరి వీధులు
- జై నారసింహా.. జైజై నారసింహా నినాదాలతో మార్మోగిన మంగళాద్రి
- రథోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: నగరంలో కొలువుదీరిన లక్ష్మీనృసింహ స్వామి దివ్య రథోత్సవం మంగళవారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. దివ్యమంగళ స్వరూపులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో మంగళాద్రి భక్తులతో పోటెత్తింది. నగర వీధులన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించుకున్న స్వామి వారు మంగళవారం ఉదయం బంగారు గరుడోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం బ్రాహ్మణ సమారాధన అనంతరం 3 గంటలకు ఉభయదేవేరులతో స్వామి వారు దివ్యరథాన్ని అధిరోహించారు. అలంకరణ, పూజల అనంతరం 4 గంటలకు స్వామి దివ్య రథం భక్తుల గోవింద నామస్మరణ మధ్య బయలుదేరగా జైనారసింహా.. జైజై నారసింహా నినాదాలతో మంగళాద్రి భక్తిపారవశ్యంలో ఓలలాడింది. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. గాలిగోపురం వద్ద నుంచి బయల్దేరిన రథోత్సవం మెయిన్ బజార్‌లోని మిద్దె సెంటర్ ఆంజనేయ స్వామి ఆలయం వరకు చేరుకుని అక్కడ పూజల అనంతరం తిరిగి అదే మెయిన్‌బజార్‌లో గాలిగోపురం వద్దకు చేరుకుంది. భక్తులు భారీగా తరలిరావడంతో పలురోడ్లు కిటకిటలాడాయి. ఉత్సవ కైంకర్యపరులుగా మాఢభూషి వేదాంతచార్యులు వ్యవహరించగా ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు తిరునాళ్లకు వచ్చిన భక్తులకు తాగునీటి ప్యాకెట్లు, అల్పాహారం, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.



రథోత్సవంలో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు, ఆప్కో చైర్మన్ చిరంజీవి



ప్రత్యేక అలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి

మహిళా సమగ్రాభివృద్ధే ధ్యేయం

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళల సమగ్రాభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పరిపాలన చేస్తోందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంతో పాటు బాల్య వివాహాల నిరోధంపై జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నకుమార్ మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో మహిళల ప్రాధాన్యత పెరిగిందని చెప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయంగా మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి గౌరవప్రదమైన స్థానంలో నిలిపారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి, జెడ్పీ సీఈవో జె.మోహన్‌రావు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి రత్నకుమార్, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

అవరోధాలు అధిగమిస్తే విజేతలే

- నా విజయం వెనుక ముప్పై ఏళ్ల కష్టం దాగుంది
- మహిళల విజయం వెనుక పురుషుల త్యాగాలు, ప్రోత్సాహాలు ఉంటాయి
- మహిళా దినోత్సవ ముందస్తు వేడుకల్లో మంత్రి ఆర్కే రోజా
- మంత్రి రోజాకు ఏఎన్‌యూ విశిష్ట మహిళా పురస్కారం ప్రదానం

ఏఎన్‌యూ: ప్రతి మహిళకు జీవితంలో అవరోధాలు, నిరుత్సాహం ఎదురవుతాయని, వాటిని మనోధైర్యంతో అధిగమిస్తే అందరూ తప్పకుండా విజేతలవుతారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మంగళవారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముందస్తు వేడుకలకు రోజా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగిస్తూ నా జీవితంలో సినీ నటిగా, రాజకీయ నాయకురాలిగా ఎన్నో విజయాలు చూశానని, కానీ పది మందికి సేవ చేసే విలక్షణమైన విజయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాకు ఇచ్చారన్నారు. నా విజయం వెనుక 30 ఏళ్ల కష్టం ఉందన్న మంత్రి తాను ఎన్నుకున్న సినీ, రాజకీయ రంగాలు రెండూ పురుషాధిక్యమైనవేనన్నారు. కానీ ఎంతో కష్టపడి వాటిలో ఉన్నత స్థాయికి ఎదిగానన్నారు. నా ఉన్నతి వెనుక అన్నదమ్ముల అండ, భర్త ప్రోత్సాహం, కుమారుడి త్యాగం, నా విజయానికి కావాల్సిన ప్రేరణ ఉన్నాయన్నారు. ప్రతి మహిళ విజయం వెనుక పురుషులు కూడా ఉంటారన్నారు. మహిళలను తోబుట్టువుల్లా చూసే సీఎం దొరకడం మనందరి అదృష్టమన్నారు. మహిళలకు ఏ కష్టం, అవసరం వచ్చినా సీఎం వెంటనే స్పందించడంతో పాటు పరిష్కారాన్ని చూపిస్తున్నారన్నారు. దిశ చట్టం జాతీయ స్థాయిలో ఇంకా అమల్లోకి రాకపోయినా ఏపీలో దిశ పోలీస్ స్టేషన్లు, యాప్ వంటి ప్రత్యేక చర్యల ద్వారా మహిళలకు సీఎం రక్షణ కవచం ఏర్పాటు చేశారన్నారు. ఈ పురస్కారం మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. అనంతరం ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ ఏఎన్‌యూ విశిష్ట మహిళా పురస్కారాన్ని మంత్రి రోజాకు ప్రదానం చేశారు. మహిళా అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ శాంతిశ్రీ, పాలకమండలి సభ్యురాలు ఆచార్య సరస్వతి రాజు అయ్యర్, పలువురు మహిళా అధికారులు పాల్గొన్నారు.



మంత్రి రోజాను సత్కరిస్తున్న వైస్ చాన్సలర్ రాజశేఖర్, రిజిస్ట్రార్ కరుణ

ఒకేసారి 17 వైద్య కళాశాలలు

- ఏప్రిల్ 1 నుంచి పీజీ వైద్య విద్యార్థులకు సీఎంఈ
- హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ బాబ్జి
- ఘనంగా గుంటూరు వైద్య కళాశాల కాలేజీడే వేడుకలు

గుంటూరు మెడికల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి 17 వైద్య కళాశాలలను తొలిసారిగా ప్రారంభిస్తున్నట్లు డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జి అన్నారు. గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో మంగళవారం రాత్రి వైద్య కళాశాల కాలేజ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ బాబ్జి మాట్లాడుతూ పీజీ వైద్య విద్యార్థులకు ప్రాంతీయ నిరంతర వైద్య విద్య కార్యక్రమాలను ఏప్రిల్ 1 నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ ఏవీ గురువారెడ్డి మాట్లాడుతూ వైద్య వృత్తిలో ఉన్నవారు మానవత, పాజిటివ్ దృక్పథం అలవర్చుకోవాలని చెప్పారు.

వైద్య కళాశాల చరిత్రలో స్వర్ణయుగం..

వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చాగంటి పద్మావతిదేవి మాట్లాడుతూ నాడు - నేడులో భాగంగా కళాశాలలో ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాల ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.100 కోట్లు మంజూరు చేసిందన్నారు. వైద్య కళాశాల చరిత్రలో ఈ ఏడాది స్వర్ణయుగమని అభివర్ణించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వైద్య కళాశాల ఈ-సావనీర్‌ను డాక్టర్ బాబ్జి ప్రారంభించారు. జింఖానా కో-ఆర్డినేటర్లు డాక్టర్ బాలభాస్కరరావు, డాక్టర్ హనుమంతరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి, డాక్టర్ చంద్రకళ, పలువురు బోధనా సిబ్బంది, గుంటూరుకు చెందిన పలువురు సీనియర్ వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. పలు సాంస్కృతి కార్యక్రమాలతో వైద్య విద్యార్థులు అలరించారు.



మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతిని సన్మానిస్తున్న డాక్టర్ బాబ్జి తదితరులు

నిజమైన సాధికారితకు బలమైన పునాది



నిజమైన మహిళా సాధికారితకు ఆంధ్రప్రదేశ్‌లో బలమైన పునాదులు పడుతున్నాయి. రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్య, వ్యాపార రంగాలలో మహిళల పాత్ర ఈ రాష్ట్రంలో గతంతో పోల్చితే గణనీయంగా పెరిగింది. మహిళలకు చాలా రంగాలలో ఊహించనంతగా ప్రాధాన్యం, గౌరవం, ప్రాతినిధ్యాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కల్పించింది. మహిళలపై దాడులు ఏపీలో గణనీయంగా తగ్గాయి. ఈ పరిస్థితులు ఇలాగే మరి కొంతకాలం కొనసాగితే మహిళల సమగ్రాభివృద్ధి, సంక్షేమంలో దేశానికే ఏపీ ఆదర్శంగా నిలుస్తుంది.

– ఆచార్య కె.సునీత, ఓఎస్‌డీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ

మహిళల్లో ఆత్మస్థైర్యం పెరిగింది



మన రాష్ట్రంలో గతంతో పోల్చితే ప్రస్తుతం మహిళలల్లో ఆత్మ స్థైర్యం గణనీయంగా పెరిగింది. మహిళలు ఏదైనా ధైర్యంగా చెప్పడం, చెయ్యగలిగే పరిస్థితులు వచ్చాయి. డ్వాక్రా మహిళల రుణాల మాఫీతోపాటు పలు మహిళా ప్రోత్సాహక పథకాల ద్వారా మహిళలు స్వయం ఉపాధితోపాటు, చిన్న ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేసుకోగలుగుతున్నారు. దీని వల్ల మహిళా సాధికారిత పెరిగింది. అమ్మఒడి వంటి పథకాల ద్వారా నేరుగా మహిళల ఖాతాలలోకి డబ్బులు డీబీటీ రూపంలో వేయడం ద్వారా మహిళలు ఆర్థిక, సామాజిక స్వావలంబన పొందగలుగుతున్నారు.

– డాక్టర్ ఎస్.కన్యాకుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కాలేజ్

వైఎస్సార్ కంటి వెలుగు ఫేజ్-3 పటిష్టంగా అమలు

కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ఆదేశం

గుంటూరు వెస్ట్: వైఎస్సార్ కంటి వెలుగు ఫేజ్-3లో భాగంగా 60 సంవత్సరాలు దాటిన వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 60 ఏళ్లు దాటిన వృద్ధులు జిల్లాలో 2,38,937 మంది ఉన్నారన్నారు. వీరిలో 35 శాతం మందికి ఇప్పటికే డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. మిగిలిన వారికి ఫేజ్-3లో భాగంగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో ఉన్న 568 సచివాలయాలను 17 బృందాలకు ఇప్పటికే మ్యాపింగ్ చేశామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల వారీగా ప్రతిరోజూ నిర్వహించే కంటి పరీక్షలపై వచ్చే నెలరోజుల వరకు యాక్షన్ ప్లాన్ తయారు చేసి తనకందించాలని చెప్పారు. అధికారులు సిబ్బందిని సమన్వయం చేసుకుని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, డీసీఎంఓ డాక్టర్ చుక్కా రత్న మన్మోహన్, అధికారులు పాల్గొన్నారు.

సీఆర్‌డీఏ పరిధిలో 14 ఎకరాల భూమికి ...

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సీఆర్‌డీఏ పరిధిలోని 14 ఎకరాల భూమిని ఈ-ఆక్షన్ పోర్టల్ ద్వారా సంబంధించిన అబ్‌సెట్ ప్రైస్ నిర్ధారించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నవులూరు గ్రామానికి ఆనుకొని ఉన్న విజయవాడ-గుండుగొలను జాతీయ రహదారి 16 బైపాస్ వద్ద ఉన్న పది ఎకరాల విలువ రూ.5.94 కోట్లకు నిర్ధారించారన్నారు.

జనరిక్ మందులను ప్రోత్సహించాలి

- పేదలకు ఉచితంగా వైద్యం అందించడమే సీఎం జగన్ లక్ష్యం
- 'జన ఔషధి దివస్'లో మంత్రి విడదల రజిని

మంగళగిరి: జనరిక్ మందులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గుంటూరు జిల్లా ఆత్మకూరులోని నిర్మల ఫార్మసీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జన ఔషధి దివస్ కార్యక్రమాన్ని మంత్రి రజిని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఔషధ కంపెనీలు మార్కెటింగ్, పర్సంటేజీలను ఆశ చూపుతూ మందులను అధిక ధరలకు విక్రయించే ప్రయత్నం చేస్తుంటాయని, వారి మాయలో ఎవరూ పడకూడదన్నారు. మందుల చీటీలపై రోగాలకు సంబంధించిన ఔషధాల పేరే రాయాలని చెప్పారు. రోగులంతా తక్కువ ధరకు లభించే జనరిక్ మందులను కొనుగోలు చేసేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఔషధ నియంత్రణ అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలందరికీ అత్యంత సులువుగా, వేగంగా నాణ్యమైన వైద్యం పూర్తి ఉచితంగా అందించాలనే లక్ష్యంతో పని చేస్తున్నారని చెప్పారు. సీఎం జగన్ లక్ష్యాలు, ప్రభుత్వ సంకల్పం నెరవేర్చేలా ఔషధ నియంత్రణ శాఖ అధికారులు పని చేయాలన్నారు.

జన ఔషధి దుకాణాల్లో 1,759 రకాల మందులు, 280 సర్జికల్ పరికరాలు లభిస్తున్నాయన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 145 జన ఔషధి కేంద్రాలు ఉన్నాయని, రానున్న రోజుల్లో మరిన్ని ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఔషధ నియంత్రణ శాఖ డీజీ రవిశంకర్ నారాయణన్, డైరెక్టర్ ఎంబీఆర్ ప్రసాద్, అధికారులు అనిల్, లక్ష్మణ్, రాష్ట్ర జన ఔషధి సమన్వయకర్త హరికృష్ణ, కళాశాల ప్రెసిడెంట్ సుందరి, సెక్రటరీ నిర్మలజ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

15న ఎంహెచ్‌ఏ కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్: మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్‌ఏ) మేల్ పునర్విభజన కౌన్సెలింగ్ ఈనెల 15న నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. పునర్విభజన సీనియార్టీ లిస్టును 7వ తేదీన విడుదల చేశామని, ఈనెల 10వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం 14న ఫైనల్ సీనియార్టీ జాబితాను ప్రకటిస్తామని డాక్టర్ శ్రావణ్‌బాబు వెల్లడించారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో నిలబడాలి

పీడీజే పార్థసారథి



కేక్ కట్ చేస్తున్న మహిళా ఉద్యోగులు, చిత్రంలో పీడీజే పార్థసారథి

గుంటూరు లీగల్: మహిళలు ఆత్మస్థైర్యంతో నిలబడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి సూచించారు. మంగళవారం పీడీజే కోర్టు హాలులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కోర్టు మహిళా ఉద్యోగుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పీడీజే పార్థసారథి మాట్లాడుతూ మానసికంగా వెనుకబడిన వారిని ప్రోత్సహిస్తూ సమాజంలో ముందడుగా ఉండాలని తెలియజేశారు. కుటుంబానికి, సమాజానికి స్త్రీ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సీనియర్ సూపరింటెండెంట్ జ్యోతి, వివిధ కోర్టుల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రాధాన్యం

సాక్షి, అమరావతి: మహిళా సాధికారతకు సీఎం జగన్ మోహన్ రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఠాగూర్ మెమోరియల్ లైబ్రరీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళల భద్రత, వారికి ఆర్థికంగా రాజకీయంగా, సామాజికంగా అన్ని అంశాల్లో సముచిత స్థానం కల్పిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ అని ప్రశంసించారు. ఆడపిల్లల చదువుల కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని కొనియాడారు.

'ఇస్లామిక్' భవనానికి శంకుస్థాపన



నూతన భవన నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, కేఎస్ లక్ష్మణరావు, మేయర్ మనోహర్ నాయుడు, మద్దాళి గిరి, ముస్తఫా, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, ముస్లిం మత పెద్దలు

లక్ష్మీపురం: గుంటూరు నగరంలోని పట్టాభిపురంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూఘర్ కమ్ షాదీఖానా వెనుక వైపు ఉన్న మున్సిపల్ స్థలంలో ఇస్లామిక్ కౌన్సిల్ సెంటర్, ఇస్లామిక్ లైబ్రరీ, దారుల్ ఖజా భవన నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన నిర్వహించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ వెస్ట్ ఉలేమా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మద్దాళి గిరి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. అనంతరం ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్, డిప్యూటీ మేయర్ షజీలా, హజ్ కమిటీ డైరెక్టర్ ముఫ్తీ అబ్దుల్ బాసీత్, మతపెద్దలు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దేవానంద్, కార్పొరేటర్లు రోషన్, ఉడుముల శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు టీఎల్‌వీ వీరాంజనేయులు, షాదీఖానా కమిటీ సభ్యులు నగర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథులు మాట్లాడుతూ..

మేలు జరిగిందని భావిస్తే...

మేలు జరిగిందని భావిస్తేనే మాకు ఓటేయండని ప్రజలను ధైర్యంగా కోరిన మొట్టమొదటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. నమ్మిన నాయకుడి కోసం ఎత్తిన జెండా దించని నైజం ముస్లిం మైనార్టీలది. మాట ఇస్తే ఎన్ని ఇబ్బందులైనా తప్పనివారు నా ముస్లిం సోదరులు. 4 శాతం రిజర్వేషన్ కల్పించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ రుణం తీర్చుకునేందుకు ఏమీ ఆశించకుండానే ఆయన తనయుడు ముఖ్యమంత్రి జగన్ అడుగులో అడుగేసిన చరిత్ర ముస్లిం మైనార్టీలది. వారి అండదండలతోనే వైఎస్సార్‌సీపీ రాష్ట్రంలో 151 స్థానాలు కైవసం చేసుకుంది.

– లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ

ప్రతి ఒక్కరినీ ప్రేమించడమే ఇస్లాం సంప్రదాయం

సర్వమానవాళికి ప్రేమను అందించడమే ఇస్లాం సంప్రదాయం. అటు దేశ, ఇటు రాష్ట్ర అభివృద్ధిలో ముస్లింల పాత్ర ఎంతో కీలకం.

– డొక్కా మాణిక్యవరప్రసాద్, గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ

ముస్లింల మేలు కోసం సీఎం జగన్ చిత్తశుద్ధితో కృషి

దివంగత మహానేత వైఎస్సార్ ఆశయ సాధనే లక్ష్యంగా ముస్లింల ప్రయోజనాల కోసం చిత్తశుద్ధితో సీఎం జగన్ కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో సీఎంకల్పించిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ముస్లిం సోదరులు తమ పిల్లల్ని మరింత ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్ద వచ్చు.

– ముస్తఫా, తూర్పు ఎమ్మెల్యే

టీడీపీ హయాంలో ముస్లింలపై చిన్నచూపు

తెలుగుదేశం హయాంలో ముస్లిం సామాజిక వర్గానికి అసలు మంత్రి వర్గంలో చోటే దక్కలేదు. దేశ చరిత్రలోనే ముస్లింల అభివృద్ధికి మొట్టమొదటిగా బీజం వేసిన మహనీయుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్. నేడు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి.

– కావటి మనోహర్ నాయుడు, మేయర్

పిల్లల్ని బడికి పంపితే డబ్బులు ఇస్తున్న ఏకైక సీఎం జగన్

దేశంలోనే పిల్లల్ని బడికి పంపితే డబ్బులు నేనిస్తానన్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్. ఆయన ప్రవేశ పెట్టిన అమ్మఒడి పుణ్యమాని ముస్లిం మైనార్టీలంతా పిల్లలను ఇప్పుడు పనులకు కాకుండా బడులకు పంపుతున్నారు.

– మద్దాళి గిరి, పశ్చిమ ఎమ్మెల్యే

విద్యావకాశాలు పెరగాలి

మైనార్టీలకు విద్యావకాశాలు మరింతగా పెరగాల్సిన అవసరం ఉంది. ఇస్లామిక్ లైబ్రరీలో మత గ్రంథాలతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను కూడా అందుబాటులో ఉండేలా చూడాలి. అందుకు గాను తాను స్వయంగా లక్షరూపాయాల విలువైన పుస్తకాలను ఇస్లామిక్ లైబ్రరీకి అందజేస్తా.

– కె.ఎస్.లక్ష్మణరావు, ఎమ్మెల్సీ

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మిడ్‌డే మీల్స్ డైరెక్టర్ డాక్టర్ నిధిమీనా



డాక్టర్ నిధిమీనాను సన్మానిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ జి రామారావు

గుంటూరు రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ డాక్టర్ నిధి మీనా తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నగర శివారుల్లోని లాంఫాంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో లింగసమన్వయం కోసం సాంకేతిక ఆవిష్కరణలు అనే అంశంపై సదస్సు మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు రాజకీయంగా, పారిశ్రామికంగా, ఉద్యోగాలలో రాణిస్తున్నారని వివరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు మాట్లాడుతూ మహిళలు విశ్వవిద్యాలయంలో 40 శాతం పాలనా రంగంలో, ఉన్నత పదవుల్లో ఉన్నందుకు గర్వపడుతున్నామన్నారు. కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ సీహెచ్ చిరంజీవి మాట్లాడుతూ సమాజంలో తల్లిపాత్రకు అధిక ప్రాధాన్యం ఉందన్నారు. మహిళల సాధికారత దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా మిడ్‌డే మీల్స్ డైరెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ మణి పాల్గొన్నారు.

మహిళల్లోనే వైవిధ్యమైన నాయకత్వ లక్షణాలు

- ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ అన్నపూర్ణ
- విజ్ఞాన్‌లో ఘనంగా మహిళా దినోత్సవం



మాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న అన్నపూర్ణ తదితరులు

చేబ్రోలు: మహిళల్లోనే వైవిధ్యమైన నాయకత్వ లక్షణాలు ఉంటాయని గుంటూరు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎన్.అన్నపూర్ణ అన్నారు. మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎన్.అన్నపూర్ణ మాట్లాడుతూ మహిళలు జీవితంలోను, సమాజంలోని సమస్యలపై గట్టిగా పోరాడాలన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బీ కరుణ మాట్లాడుతూ మహిళలు అవకాశాల కోసం ఎవరి కోసమో ఎదురుచూడొద్దని, విజ్ఞానం, నైపుణ్యం పెంచుకుంటే స్త్రీలు ఏదైనా సాధించవచ్చునన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. మేనేజ్‌మెంట్ స్టడీస్ డిపార్ట్‌మెంట్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ మీద రూపొందించిన ప్రత్యేకమైన 'మనోజ్ఞ' మ్యాగజైన్‌ను ఆవిష్కరించారు.

13 నుంచి కానిస్టేబుళ్ల అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు



పోలీస్ పరేడ్ మైదానంలో పర్యటించిన ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం: గుంటూరు నగరంలోని పోలీస్ పేరేడ్ మైదానంలో ఈనెల 13 నుంచి పోలీస్ కానిస్టేబుళ్ల అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు జరగనున్నాయి. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ మంగళవారం మైదానంలో పర్యటించారు. పరుగు పందెం పోటీలు నిర్వర్తించేందుకు అనువుగా ఉండే స్థలాన్ని పరిశీలించారు. అదే విధంగా ఇతర పోటీల నిర్వహణపై పోలీస్ అధికారులతో చర్చించారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పురుష/ మహిళా అభ్యర్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేయాల్సిన మౌలిక సౌకర్యాలపై చర్చించారు. మైదానంలో అక్కడక్కడ ఏపుగా పెరిగిన గడ్డిని యంత్రం సహాయంతో తొలగించారు. ఎస్‌బీ సీఐ బి.నరసింహా రావు, ఆర్‌ఐలు థామస్‌రెడ్డి, రమేష్ కృష్ణన్ పాల్గొన్నారు.